క్లుప్తంగా

నేడు సర్ధార్‌నగర్‌లో 'కంటి వెలుగు'

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్ధార్‌ నగర్‌ గ్రామంలో 11, 14వ వార్డుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ బి.వెంకట్రామ్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రీతియైన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఇంటర్‌ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హుడాకాంప్లెక్స్‌: ఇంటర్‌ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30లోపు చేరుకోవాలని సరూర్‌నగర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జి.రాణి తెలిపారు. సరూర్‌నగర్‌ పరీక్షా కేంద్రంలో ఇంటర్‌ మొదటి సంవత్సరం 538, ద్వితీయ సంవత్సరంలో 530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆమె చెప్పారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు హాల్‌టికెట్‌ తప్పనిసరిగా తీసుకెళ్లాలని, పెన్నులు, పెన్సిల్‌, ఎరేజర్‌, ఎగ్జామ్‌ ప్యాడ్‌లు మాత్రమే వెంట తెచ్చుకోవాలని తెలిపారు. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, డిజిటల్‌ వాచ్‌లకు అనుమతి లేదన్నారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

గృహహింస కేసులో వ్యక్తికి జైలు

రంగారెడ్డి కోర్టులు: గృహ హింస కేసులో ఓ వ్యక్తికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు రంగారెడ్డి జిల్లా మూడవ అదనపు మెట్రోపాలిటన్‌ మ్యాజిస్ట్రేట్‌ న్యాయమూర్తి కొత్త రవి. కోర్టు పీపీ. గోపాల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు సైదులు(32) వివాహమై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సైదులు భార్యను నిత్యం వేధించేవాడు. పలుమార్లు భార్యకు అబార్షన్‌ చేయించాడు. ఇదిలా ఉండగా భర్త రోజులు తరబడి ఇంటికి రాకపోవడం, ఇంట్లో తన బంగారం కూడా కనిపించకపోవడంతో భర్త తీరుపై అనుమానంతో తన గురించి వాకబు చేయగా భర్త మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని నిర్ధారించుకుని భర్తని నిలదీసింది. కొద్దిరోజుల తరువాత పండగకి ఇంటికి వచ్చిన నిందితుడు తన చిన్న కూతురిని అర్ధ రాత్రి ఇంట్లో నుంచి తీసుకుని పరారయ్యాడు. ఈ విషయమై ప్రశ్నించిన భార్యకు తన అవసరాల కోసం పాపని అమ్మేస్తానని నిందితుడు చెప్పడంతో బాధితురాలు హయత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా కేసు విచారించిన కోర్టు పైవిధంగా మంగళవారం తీర్పు వెలువరించింది.

ఏటీఎం చోరీకి యత్నం



దుండగులు ధ్వంసం చేసిన ఏటీఎం

చైతన్యపురి: ఏటీఎం ధ్వంసం చేసి డబ్బు చోరీకి విఫలయత్నం చేసిన ఘటన చైతన్యపురి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ మదుసూధన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వీఎంహోమ్‌ మెట్రో స్టేషన్‌ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌ ఏటీఎంలోకి సోమవారం అర్ధ రాత్రి చొరబడిన దుండగులు చోరీకి యత్నించారు. ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి ఎంత ప్రయత్నించినా చోరీకి వీలు కాకపోవటంతో వదిలేసి వెళ్లారు. ఉదయం గమనించిన బ్యాంక్‌ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజ్‌ పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

సీఐ ఉపేందర్‌కు సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్‌ వస్పుల జంగయ్య సత్కరించారు. మంగళవారం సీఐ ఉపేందర్‌ జన్మదిన సందర్భంగా ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా పలువురు నాయకులు కలిశారు. ఆయనకు గౌతమబుద్ధుడి ప్రతిమను బహూకరించిన వస్పుల జంగయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల మండల టీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు కంబాల పరమేశ్‌, నాయకులు వీరయ్య, రఘురాములు, రమేశ్‌, వర్కాల శ్రీనివాస్‌, సుధాకర్‌ ఉన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్‌'లో 'మోడల్‌' విద్యార్థుల సత్తా



మహేశ్వరం ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌

12 మంది స్కాలర్‌షిప్‌లకు అర్హత

- రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48వేలు అందజేత



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులు

మహేశ్వరం: ప్రతిభావంతులైన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకుని, డ్రాపవుట్లను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి ఉపకార వేతన పరీక్ష(నేషనల్‌ మీన్స్‌ కమ్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌)లో మహేశ్వరం మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. 2022–2023 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గతేడాది డిసెంబర్‌ 18న ఎన్‌ఎంఎంఎస్‌ అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మహేశ్వరం మోడల్‌ స్కూల్‌కి చెందిన 12 మంది విద్యార్థులు అక్షర లక్ష్మి, సింధు, వర్ష, తేజస్విని, శ్రావ్య, రాణి, సాహితి, కీర్తన, అఖిల్‌, కార్తీక్‌, కిశోర్‌, విశ్వనాథ్‌ స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్‌ వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేలు(నెలకు రూ.వేయి చొప్పున) అందుతుంది. ఎంపికైన విద్యార్థులతో బ్యాంకు అకౌంట్‌ తెరిపించి వారి పూర్తి వివరాలు జిల్లా విద్యాశాఖ అధికారులకు సేకరించి కేంద్రానికి పంపనున్నారు.

స్కాలర్‌షిప్‌ విడుదల ఇలా...

ఎన్‌ఎంఎంఎస్‌ స్కాలర్‌ షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతిలో సంవత్సరానికి రూ.12 వేలు విద్యార్థి అకౌంట్‌లో జమఅవుతాయి.10వ తరగతిలో స్కాలర్‌షిప్‌ కొనసాగాలంటే 9వ తరగతిలో 55శాతం మార్కులు సాధించాలి. 10వ తరగతిలో 60శాతం మార్కులు సాధిస్తే ఇంటర్‌ మొదటి సంవత్సరంలో స్కాలర్‌షిప్‌ అందుతుంది. ఇంటర్‌ మొదటి సంవత్సరంలో 55శాతం మార్కులు సాధిస్తే రెండో సంవత్సరంలోనూ లబ్ధి చేకూరుతుంది.

అర్హత పరీక్షకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యతతో కూడిన ఆంగ్లంలో బోధిస్తుంటారు. పాఠశాలలో మొత్తం 722 మంది విద్యార్థులున్నారు. ఈ స్కాలర్‌షిప్‌ అర్హత పరీక్షకు ప్రతీ సంవత్సరం పాఠశాల నుంచి ఎంపికవుతున్నారు. 2021–22లో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పరీక్షలకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తూ.. స్పెషల్‌ నోట్స్‌, మోడల్‌ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇటీవల అమెరికాలోని టెక్సాస్‌ నగరంలో నిర్వహించే ఇంటర్నేషనల్‌ స్పేస్‌ డెవలప్‌మెంట్‌ కా న్ఫరెన్స్‌లో పాల్గొనడానికి మోడల్‌ స్కూల్‌ నుంచి 9 మంది విద్యార్థులకు ఆహ్వానం అందింది. రాష్ట్ర స్థాయి సైన్స్‌ ఫెయిర్‌ అవార్డు, జాతీయ స్థాయి కరాటే పోటీలకు మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు ఎంపికవ్వడం గమనార్హం.

రెండు నెలలు శిక్షణ



ఉపాధ్యాయులు ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షకు రెండు నెలల పాటు ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. ప్రిన్సిపాల్‌ బాబు, పరమేశ్‌ సర్‌ నామీద నమ్మకంతో అర్హత పరీక్షకు దరఖాస్తు చేసి ప్రిపేర్‌ చేశారు. వారి సూచనలు, సలహాలతో చదివి అర్హత పరీక్షకు ఎంపికయ్యాను. ప్రతీ సంవత్సరం వచ్చే సాల్కర్‌షిప్‌ను చదువుకు ఉపయోగించుకుంటాను.

– జి.సింధు మోడల్‌ స్కూల్‌ విద్యార్థిని, మహేశ్వరం

పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు ఉపయోగిస్తా



స్కాలర్‌షిప్‌కు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. తనకు ప్రతీ సంవత్సరం వచ్చే స్కాలర్‌షిప్‌తో జనరల్‌ నాలెడ్జ్‌, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, చదువు ఖర్చులకు ఉపయోగించుకుంటాను. మా తల్లిదండ్రులపైన భారం పడకుండా ఉపయోగపడుతుంది.

– విశ్వనాథ్‌, మోడల్‌ స్కూల్‌ విద్యార్థి, మహేశ్వరం

ప్రత్యేక శిక్షణ ఇచ్చాం



ఎన్‌ఎంఎంఎస్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులను గుర్తించి వారికి రెండు నెలల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం. 12 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. గతేడాది 17 మంది ఎంపికయ్యారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకొస్తాం.

– బాబు, ప్రిన్సిపాల్‌, మోడల్‌ స్కూల్‌, మహేశ్వరం

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాదాపూర్‌లో సర్పంచ్‌ మంద సాయిలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సురసాని రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గం యూత్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ తాళ్ల కార్తీక్‌, సోషల్‌ మీడియా కన్వీనర్‌ బొక్క దీక్షిత్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌ రైతుబజార్‌కు నేడు సెలవు ఉందని రైతుబజార్‌ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతినెలా మూడో బుధవారం సెలవు ఉన్నందున నేడు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఆమె పేర్కొన్నారు. గురువారం మళ్లీ యధావిధిగా రైతుబజార్‌లో క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి యావజ్జీవం

రంగారెడ్డి కోర్టులు: భార్యను హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవాని చంద్ర, కోర్టు ఏపీపీ. జి కస్తూరి తెలిపిన వివరాల ప్రకారం.. 2016 సెప్టెంబర్‌లో సరూర్‌నగర్‌ ఠాణా పరిధిలో నమోదైన యువతి ష్యాంకి భాయ్‌ హత్య కేసులో నిందితుడైన భర్త హలావత్‌శంకర్‌(34) పెళ్లయిన సంవత్సరం నుంచి పిల్లలు పుట్టట్లేదని భార్యను వేధించడం మొదలు పెట్టాడు. నిందితుడు భార్యకి తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య అయిన మృతురాలిని ప్రతీ చిన్న విషయానికి అనుమానించి తిట్టడం, కొట్టడం చేసేవాడు. ఈ తరుణంలో ఒకరోజు నిందితుడు పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకునే సమయానికి భార్య వేరొకరితో మాట్లాడడం గమనించి ఆమెను గొంతు నులిమి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడు.మృతురాలి తండ్రి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కేసు విచారించి కోర్టులో చార్జ్‌ షీట్‌ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు మంగళవారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

సమస్యలు పరిష్కరించండి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్‌ చైర్మన్‌ రాంపాల్‌నాయక్‌, వైస్‌చైర్మన్‌ దుర్గయ్య, కమిషనర్‌ శ్యాంసుందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న 1994–95 బ్యాచ్‌ ఆకుతోటపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు

బడంగ్‌పేట్‌: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 29 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు. వారి పాఠశాల అభివృద్ధికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హయత్‌నగర్‌: టీవీఎస్‌ ఎక్సెల్‌ను డీసీఎం ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం హయత్‌నగర్‌ పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మన్సూరాబాద్‌ డివిజన్‌లోని వీరన్నగుట్ట కాలనీలో నివసించే శ్యామల(50) తన భర్త సోమయ్యతో కలిసి జైపురి కాలనీ నుంచి వీరన్నగుట్ట వైపు టీవీఎస్‌పై ప్రయాణిస్తున్నారు. పాపయ్యగూడ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం టీవీఎస్‌ను ఢీ కొట్టింది. దీంతో టీవీఎస్‌ వెనుక సీటులో ఉన్న శ్యామల రోడ్డుపై పడింది. ఆమె తలపై డీసీఎం టైరు వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలి

జలమండలి ఎండీకి కార్పొరేటర్ల వినతి



జలమండలి ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

చైతన్యపురి: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ వ్యాప్తంగా నత్తనడకన నడుస్తున్న యూజీడీ పైప్‌లైను పనులు, తవ్వకాల వల్ల పగిలిన తాగునీటి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ పలువురు కార్పొరేటర్లు జలమండలి ఎండీ దాన కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. చైతన్యపురి, గడ్డిఅన్నారం, వనస్థలిపురం, హయత్‌నగర్‌ కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి మంగళవారం జలమండలి ఎండీని కలసి కాలనీలలో ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉచిత తాగునీటి సరఫరా అని చెప్పి అధిక బిల్లులు విధించి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గం పరిధిలో ఎస్‌ఎన్‌డీపీ పనులు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిందన్నారు. నత్తనడక పనుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, లో ప్రెజర్‌ నీటి సరఫరాతో తాగునీరు సరఫరా అవుతున్నా నీటి బిల్లులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా వర్షం దాటికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, వందల కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే ప్రకటిస్తున్నా పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయని ఎండీకి వివరించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో పాల్గొన్న సర్పంచ్‌, వైస్‌ ఎంపీపీ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో లక్ష్మీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి, సర్పంచ్‌ కాసుల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోలిపేట అమరేందర్‌రెడ్డి స్వామి వారికి వెండి కిరీటం, శఠారి సమర్పించారు. నామని అంజయ్య కుటుంబీకులు అన్నదానం నిర్వహించగా, బాగాల రాంరెడ్డి సేవా కార్యక్రమాలకు చేయూతనందించారు. కల్యాణోత్సవానికి జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్‌ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ బి.శ్రీనివాస్‌, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్‌, నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, కె.రూప్‌చందర్‌, ఎండీ అఫ్జల్‌బేగ్‌, ఆంజనేయులు, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్‌, సూకం సురేందర్‌, శ్రీశైలం, నల్లి శ్రీధర్‌, ధవన్‌ తదితరులు పాల్గొని పూజలు చేశారు.



హాజరైన భక్త జనం

బహిరంగ చర్చకు కారు, కమలం నేతల సవాల్‌

అడ్డుకున్న పోలీసులు



బీఆర్‌ఎస్‌ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

మహేశ్వరం: విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై బీఆర్‌ఎస్‌ యూత్‌ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్‌, బీజేవైఎం మండల అధ్యక్షుడు వనంపల్లి శ్రావణ్‌ ఒకరికొకరు చర్చకు రావాలని సవాల్‌ విసురుకోవడంతో మంగళవారం అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద పోలీసులు మోహరించారు. అక్కడకు ఎవరినీ రానీయకుండా అడ్డుకున్నారు. ఉదయం నుంచి బీఆర్‌ఎస్‌, బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి ముందస్తు అరెస్టులు చేశారు. ఉదయం 10గంటల ప్రాంతంలో బీఆర్‌.అంబేడ్కర్‌ విగ్రహం వద్దకు వస్తున్న ఇరు పార్టీల నేతలను అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్‌ నేతలను అరెస్టు చేసి కందుకూరు పోలీస్‌ స్టేషన్‌, బీజేపీ నేతలను పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మహేశ్వరం ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్‌, ఎస్‌ఐలు బందోబస్తును ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ఎవరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

సుందరీకరణ పనుల పరిశీలన



సుందరీకణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌: డివైడర్ల మధ్య ఉన్న చెట్లను ఏపుగా పెంచి అత్యంత సుందరీకరణ చేయనున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సాగర్‌రింగ్‌ రోడ్డు నుంచి ఇబ్రహింపట్నం వెళ్లే రహదారి మధ్య చెట్ల సుందరీకరణ పనులను ఆయన సాగర్‌ కాంప్లెక్స్‌ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరమంతా అందంగా కనిపించాలని, రోడ్లు శుభ్రంగా ఉండి రోడ్లపై ప్రయాణించే వారికి ఈ రోడ్డును కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. చెట్లు గుబురుగా పెరిగి మంచి ఆకృతి ఇస్తాయని దీంతో ఈ ప్రాంతం అంత సుందరంగా ఉంటుందని చెప్పారు. ఈ పనులు పూర్తి అయితే ఆగస్టు నుంచి మంచి ఆకర్షనీయంగా ఈ రోడ్డును ప్రయాణికులు చూస్తారని తెలిపారు. దీంతో పాటు చింతల్‌కుంట వద్ద అండర్‌పాస్‌, నాగోల్‌ వద్ద కూడా ఇలాంటి పనులను చేపట్టడం జరుగుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్‌ సుజాతనాయక్‌, నాయకులు అరవింద్‌రెడ్డి, సత్యంచారి, రాంబాబు, శ్రీనివాస్‌నాయక్‌, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హస్తినాపురం: మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని పిండిపుల్లారెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారితతోనే సమానత్వం సాధ్యమవుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్‌ తీసుకొచ్చిందని చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్‌ పోరాటం చేస్తుందన్నారు. మహిళలకు రాజకీయ రంగంలో అధిక ప్రాధాన్యతనిచ్చింది కాంగ్రెస్‌ పార్టీ నేనని, మహిళల వంటింటి కష్టాలను తీర్చేందుకు రూ.500లకే గ్యాస్‌ సిలిండర్‌ను కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాలలో సరఫరా చేస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే రూ. 500లకే గ్యాస్‌ సిలిండర్‌ అందిస్తామని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు.

పేపర్‌ లీకేజీపై కాంగ్రెస్‌ నేతల రాస్తారోకో



దిల్‌సుఖ్‌నగర్‌ రాజీవ్‌చౌక్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

చైతన్యపురి: టీఎస్‌పీఎస్‌సీ పోటీ పరీక్షల లీకేజీకి నిరసనగా మంగళవారం సాయంత్రం కాంగ్రెస్‌ పార్టీకి చెందిన లింగోజిగూడ కార్పొరేటర్‌ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌ రాజీవ్‌చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌ కాంగ్రెస్‌, కాంగ్రెస్‌ నాయకులు ర్యాలీగా రాజీవ్‌ చౌక్‌ చేరుకుని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో 9 ఏళ్ల తరువాత ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ వచ్చిందని, నిరుద్యోగులు ఎంతో ఆశగా పోటీ పరీక్షలు హాజరైతే లీకేజీ కారణంగా వారి జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్‌ మిద్దెల జితేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వినీత్‌, నాయకులు గాంధీనాయక్‌, భాస్కర్‌యాదవ్‌, చందు, రంజిత్‌, ఆమీర్‌ తదితరులు పాల్గొన్నారు.